


# చిత్ర నళినీయం

యద్దనపూడి సులోచనారాణి

అప్పుడే వేసవికాలం వచ్చేసింది. వెచ్చని వడగాడ్పు ఈ చెవిలోంచి ఆ చెవిలోకి కొడుతోంది. పది గంటలు దాటితే, జనం వీధుల్లోకి రావటానికి జడుస్తున్నారు. కలవారి యిళ్ళకి వట్టివేళ్ల తడికలు బిగింపబడ్డాయి. లేనివారు విసనకర్రలు, కుండల్లో చల్లని నీళ్ళు దగ్గర పెట్టుకుని కూర్చుంటున్నారు. ఎంత వేసంకాలమైనా, వడగళ్ళవానైనా ఆ వూరి రాజగోపాలస్వామి దేవాలయంలో 2 గంటలయేసరికి వూళ్లో ఆడవాళ్ళందరూ చేరవలసిందే. గుళ్ళో వున్న గన్నేరు, రావిచెట్లు యెండవేడిమిని తగలనీయకుండా చల్లదనాన్ని ప్రసాదిస్తూవుంటాయి. కొంతమంది శాస్త్రిల్లుగారి పురాణంకోసం వస్తే, మరికొంతమంది గుళ్లో గల చల్లదనానికి, లోకాభిరామాయణానికి జేరుతూవుంటారు. మొత్తం వూళ్లో ఆడవాళ్ళందరూ అక్కడికిజేరి సాయంత్రం నాల్గు గంటలవరకూ అక్కడ కూర్చుంటారు. ఆ వూరిలోకి కాస్త వున్నవాడు, దయాధర్మము, పాప పుణ్యాల భీతిగలవాడు నారాయణరావుగారు. వారి తాతముత్తాతలెవరో యీ దేవాలయాన్ని కట్టించారు. అందుకనే ఆయనకు, ఆయన తల్లికి, ఆయన భార్యకు (ఒక్క కూతురు నళినికి తప్ప) ఆ యింట్లో అందరికీ నౌకర్లు చాకర్లతోసహా ఆ గుడి అన్నా, ఆ గుళ్ళో పురాణాల శాస్త్రిల్లుగారు, పూజారి అన్నా అపరిమితమైన గౌరవమూ, భక్తీను. ఆ రాజగోపాలస్వామి దయవల్లనే తామింతవరకూ యే కష్టమూ లేకుండా బ్రతుకుతున్నామని అనుకుంటూవుంటారు.

ఇంటరువరకు మెడ్రాస్‌లో చదివిన నళినికిమాత్రం యివన్నీ అంటే ఒళ్ళుమంట. నారాయణరావుగారు నళినిని ఇంకా యే బి. ఏ. వరకో, ఎమ్. ఏ. వరకో చదివించేవారేగాని ఆయన తల్లి "ఇప్పటికే అది తెలివి మీరిపోయింది. ఓ దేముడూ లేదూ, దెయ్యమూ లేదు. ఇంక చాల్లే యింటికి తీసుకురా. ఈడొచ్చిన పిల్లని మన వూరు పేరుగాకుండా యెక్కడో వుంచుతానంటావేం. చాలు చాల్లే, రేపేదయినా అవుతే యేడ్చేందుకా?" అని కొడుకుని మందలించి నళిని చదువుకి ఫుల్‌స్టాప్ పెట్టించింది. ఆ యింట్లో బామ్మ ప్రభావం యెంతో తెలిసిన నళిని, తండ్రి "చదువుకున్నది చాల్లే అమ్మా!" అంటే మరేం మాట్లాడలేకపోయింది. కాలేజి చదువుకి స్వస్తి చెప్పబడినా నిస్పృహ చెందలేదు. తండ్రి సహాయంతో ఇతరరంగాల్లో కృషిచేయసాగింది. ఇదివరకు పత్రిక ముఖంచూడని నళిని రోజూ పత్రిక చూస్తూ ప్రపంచవార్తలు తెలుసుకోసాగింది. మూలపడిన వీణ తీసి శ్రుతులు సరిచేసింది. ఆమధ్య బద్ధకంవల్ల మానేసిన డాన్స తిరిగి క్రమబద్ధంగా అభ్యసించటం మొదలుపెట్టింది. నళిని పుణ్యమా అని ఆ వూళ్లో మొట్టమొదటగా నారాయణరావుగారు రేడియో కొన్నారు.

ఒకరోజు తండ్రి మద్రాసు వెళ్తుంటే తనుగూడా వెళ్ళి ఒక బండెడు పుస్తకాలు, కొత్తరకం కుర్చీలు, కొన్ని కర్టెన్‌లు, క్యారంబోర్డు, బాడ్‌మింటన్ ఆడటానికి నెట్టు, బాట్సు మొత్తానికి ఒక నాలుగయిదొందలు వదిలించి ఇంటికి ఒక స్పెషల్ బస్ చేయించుకుని ఆ సామానంతా వేసుకొచ్చింది. అప్పుడే పూజ ముగించుకుని బయటకు రాబోతున్న నళిని బామ్మ యీ చిత్రమంతా చూస్తూ నోట మాటరాక అలాగే నిలబడిపోయింది. అత్తగారు అలాగే నిలబడిపోవటం చూచి నళిని తల్లి బయటకు వచ్చి తనూ అత్తగారి సరసన నిలబడి చిత్రం చూడసాగింది. నౌకర్లు సంతోషంగా, ఆశ్చర్యంగా అతిపదిలంతో యెట్టుకుంటే మాసిపోతాయన్నట్లుగా ఒక్కొక్క సామానే లోపలికి పట్టుకొస్తుంటే కళ్ళప్పగించి చూడటం తప్ప అత్తాకోడళ్లిద్దరూ యేమీ చెయ్యలేకపోయారు. ఆనాటితో నళినిని వంచటమనేది శుష్కప్రయాస అనిమటుకు అనుకున్నారు.

ప్రయాణపు బట్టలన్నా మార్చుకోకుండా నళిని తెచ్చిన సామానంతటిని ఏవేవి ఎక్కడవుంటే బాగావుంటాయో నిర్ణయించి నౌకర్లతో సర్ది వేసింది. వీధిలో వచ్చే పోయే జనాన్ని కనిపింపజేసే సింహద్వారాన్ని నీలం పూలకర్టెన్ మూసేసి యిక వీధిలోనేమీ కన్పించకుండా చేసేసింది. విడిచిన బటలను పారేసే హాలులో ఒక మూల రేడియో ఆక్రమించుకుంది. విడిచిన బట్టలన్నీ అందమైన ఒక బుట్టలోకి వెళ్లిపోయాయి. రేడియోకి కొంచెం దూరంలో ఒక చక్కని టేబులూ, దానిచుట్టూ కుర్చీలు నుంచున్నాయి. సర్దుతూ సర్దుతూ మధ్యమధ్య ఆగి తనపని తనే చూసుకుంటూ, ప్రశ్నలూ, జవాబులూ రెండూ తనే చెప్పుకుని, ఓరకంట బామ్మ, అమ్మల ఆశ్చర్యాన్ని చూసీ చూడనట్లుగా నటిస్తూ, నళిని తన్లో తనే మురిసిపోయింది. నౌకర్లకిగూడా నళిని తనచేతి మంత్రదండంతో యీ యిల్లు హఠాత్తుగా మార్చివేసినట్లుగా అనిపించింది. పురాతన పద్ధతులకు తనింట్లో యీరోజుతో స్వస్తిచెప్పబడింది గదాని, యికనుంచి వూళ్లోకి యెవరైనా పెద్దమనుష్యులువస్తే యింక తనింటికి తీసుకురావచ్చని నారాయణరావుగారొక్కనిట్టూర్పువిడిచి, తనకా అవకాశం కల్పించిన నళినిని హృదయంలోనే ప్రశంసించుకొన్నారు.

దేవాలయంలో ఆరోజు మొదటగా వచ్చిన ప్రసక్తి నళిని మీద. ఒకప్రక్కన కూర్చుని తన్మయత్వంతో పురాణం వింటున్న నళిని బామ్మదగ్గరకు కునసబుగారమ్మాయి విమల వచ్చి మెల్లగా "యేమండీ! నళిని మెడ్రాస్‌నుంచి యేమేమిటి తీసుకువచ్చింది?" అంది. వచ్చిన పిల్లని కళ్లెఱ్ఱజేసి ఒకసారి ఎగాదిగా చూసింది నళిని బామ్మ. దాంతో విమల హడిలిపోయి అక్కడినుంచి మెల్లగా జారుకుంది. తమ యింటికి యెలాటి దుస్థితి కలిగిందో దాన్నిగురించి నలుగురూ యేవిధంగా చెప్పుకుంటున్నారో వూహించి నళిని

బామ్మ ఒక బరువైన నిట్టూర్పు వదిలింది. అలవాటు చొప్పున తన కష్టాన్నీ రాజగోపాలునికి మనసులో వెళ్ళబోసుకుని, చివరకు భక్తి పూర్వకంగా చేతులుజోడించి 'అంతా నీ దయ స్వామీ' అనుకుని మళ్లా పురాణం వినటంలో మునిగిపోయింది.

నారాయణ రావు గారింటి ప్రక్క శారదాంబ కొరులోంచి యేవేమి దింపారో తను చూశానని, లోపలికి గూడా వెళ్ళి అంతా చూసొచ్చానని చెప్పటంతో నే అందరూ ఆవిడచుట్టూ ఆసక్తిగా మూగారు. ముఖ్యంగా మునసబుగారమ్మాయి విమల, కరణంగారమ్మాయి కమల, పూజారి కూతురు అన్నపూర్ణ, శాస్త్రిల్లుగారమ్మాయి శ్యామల వీళ్ళకి మరీ ఆసక్తి హెచ్చింది. అదంతా ఒకసారి తాము గూడా చూస్తే యెంత బాగుంటుందో ననిపించింది.

"ఒకటుందమ్మా. దానిని యేదో యిట్లా తిప్పితే! అంతే..." శారదాంబ తర్వాత చెప్పటం మానేసి కళ్ళు పెద్దవిచేసి చూడటం మొదలు పెట్టింది. కమలకి వుత్సాహం ఆగలేదు. "అప్పు డేమయింది?" ఆత్రంగా ప్రశ్నించింది. కాసేపటికి శారదాంబ "ఏముందీ? దాంట్లోంచి సంగీతం వచ్చేసింది! నిజంగా ఆశ్చర్యంగా లేదూ?" అంది.

"ఆహా!"అంటూ అందరూ తలలూచారు. "ఇంకా యిట్లాంటివి యెన్నో వున్నాయి" శారదాంబ చెప్పటానికి వుపక్రమించింది.

"అబ్బా! మనం ఒక్కసారి వెళ్ళివస్తే యెంత బాగుంటుందీ!" విమల పట్టలేక పైకి అనుకుంది.

"దానికే ముంది వెళ్లవచ్చు. నళినియెంతో మర్యాదగా మాట్లాడుతుంది. అంత చదువుకున్నానని కాస్తంత గర్వం గూడా లేదు. ఇంకా మనకే యేమీ లేకపోయినా నీటూగోటూ జాస్తీ" శారదాంబ భావగర్భితంగా కమలను చూస్తూ అంది.

గుళ్ళోంచి ఆ సాయంత్రం వెళ్ళిపోయే ముందు కమల, విమల, అన్నపూర్ణ, శ్యామల మర్నాడెలాగయినాసరే, తప్పకుండా నళినిదగ్గరకు వెళ్ళాలని నిశ్చయించుకున్నారు.

మర్నాడు వాళ్ళు వచ్చేసరికి నళిని సోఫాలో కూర్చుని యేదో యింగ్లీషు నవల చదువుకుంటోంది. వాళ్లని చూడగానే లేచి ఆప్యాయంగా పల్కరించి లోపలకు రమ్మనమని ఆహ్వానించింది. ఎవరు ముందు మాట్లాడాలి, యేం మాట్లాడాలి అని సతమతమౌతున్న వాళ్లకి నళిని ఆబాధని తొలగించి తనే ముందు చక్కగా స్నేహంగా మాట్లాడింది. ఒక అరగంట గడిచేసరికి అయిదుగురు ఆప్తమిత్రులు అయినారు. తర్వాత యెన్నో విషయాలను గురించి మాట్లాడుకున్నారు. నళిని తను ముందు కొన్ని విషయాలు చెప్పింది. తర్వాత వాళ్ళని చెప్పమని తను వింది. మూడు గంటలు యెలా గ గడిచాయో వాళ్ళకే తెలియదు. నళినిలేచి తను మెడ్రాస్ నుంచి తెచ్చిన వస్తువులన్నీ చాలా సహజంగా ప్రాణ స్నేహితులకు చూపించినట్లు చూపించింది. వాళ్లు యింక వెళ్తామని లేవబోతుంటే ఒక్క నిమిషం వుండమని యింట్లోకివెళ్లి షర్బత్ గ్లాసుల్లోనింపి తీసుకొచ్చి యిచ్చింది. మొదట మొహమాటపడ్డా చివరకి నళిని బలవంతంవల నలుగురూ తాగార్రు. అది తనే తయారు చేశానని చెప్పి, వాళ్ళని యింకా ఆశ్చర్యపరచింది. వాళ్లు వెళ్తుండగా లేచి వీడ్కోలు యిస్తూ తప్పకుండా రోజూ వస్తే తనకి వచ్చిన విద్యలన్నీ వాళ్ళకి నేర్పుతానని వాగ్దానంచేసి, మరునాడు తప్పకుండా వస్తామని వాళ్లచేత ఒట్టు వేయించుకుని మరీ వదిలింది.

వాళ్లు వెళ్ళిపోయిన తర్వాత నళిని చూస్తూ అక్కడే నిలబడిపోయింది. తను మొదట చదువు మానేసిన రోజుల్లో కాలం యెలా గడపాలో తెలియక తన్ని తను తిట్టుకుని యింట్లోవాళ్ళని మనసులో తిట్టిపోసేది. తన అవస్థంతా కలం స్నేహితురాలు చిత్రకి తెలియజేసుకునేది.

చిత్రకీ నళినికీ రెండు సంవత్సరాలనుంచీ కలం స్నేహం సాగుతోంది. నళిని యింటర్లో జేరిన కొత్తలో విశాఖపట్నంనుంచి ఒక తెలియని అపరిచితురాలి దగ్గర్నుంచి వుత్తరం వచ్చింది. అందులో మూడే మూడు ముక్కలు ముక్తసరిగా వున్నాయి. అవి: "నీ స్నేహాన్ని వాంఛిస్తున్నాను. అంగీకరిస్తావా? అంగీకరిస్తే ఈ క్రింది ఎడ్రస్‌కు వ్రాయి." అడ్రస్‌లో కుమారి చిత్ర అని వుంటే పేరు చిత్ర అని తెలుసుకుంది.

"నీగురించి నాకేమీ తెలియదు. కలం స్నేహం విచిత్రంగా సాగుతున్న యీ రోజుల్లో మగవాళ్లుగూడా ఆడవారి పేర్లు పెట్టుకుంటున్నారు. పేరునుబట్టి స్త్రీయో పురుషుడో నిర్ణయించడం కష్టంగా వుంది. నువ్వేం చేస్తుంటావో గూడా నాకు తెలియదు. ఇలాటిపరిస్థితులలో మన స్నేహలత యెలా ముందుకు ప్రాకుతుంది?" నళిని అనుమానంగా వ్రాసింది.

దానికి వెంటనే జవాబు వచ్చింది.

"నే నెవర్నయినా నీకు ఫర్వాలేదు. ఆడపిల్లనైనా, మగపిల్లవాడినైనా నీకొచ్చే ప్రమాదం లేదు. పోనీ కలం స్నేహం బాగా పిచ్చిగావున్న యీరోజుల్లో మూలనున్న ఒక ముసలమ్మకు ఈ వుత్సాహం పుట్టిందనుకో. మనకి కావాల్సిందల్లా నీలో నాలో వున్న ఉన్నతాభిప్రాయాలు, ఆశయాలు, అవి కలవటమూను, నిజానికి నీగురించి నాకేం తెలుసు? నాకేమీ తెలియదు. అయినా నీ స్నేహం వాంఛిస్తున్నాను. అంగీకరిస్తావని ఆశిస్తున్నాను."

దానికి నళిని వ్రాసిన సమాధానము:

"నన్నుగురించి నీకేమీ తెలియనంటే యెలా నమ్మతాను? నన్ను చూడకపోయినా, కనీసం నాగురించి వినైనావుంటావు. లేకపోతే నువ్వు నాలో ఉన్నత భావాలున్నాయని యెలా అంటున్నావు? నీగురించి నేను కనీసం వినిగూడా వుండలేదు. నీ అడ్రస్‌లో ఎం. బి. బి. ఎస్. ఫోర్తియర్ అని వున్నదిగాబట్టి నువ్వు డాక్టరు చదువుతున్నావని అనుకుంటున్నా. మొత్తానికి మూలనున్న ముసమ్మవిమాత్రం గాదు. ఇక తేలవలసింది ఆడపిల్లవా? మగపిల్లవాడివా? అయినా యిద్దరు మనుష్యులలో ఉన్నతాభిప్రాయాలున్నంత మాత్రాన వారి స్నేహలత పెనవైచుకుని పూలుపూసి, కాయలు కాస్తుందా?"

ఈవిధంగా మనకు స్నేహం యెలా యెలా కుదురుతుంది అనుకుంటూనే వాళ్లిద్దరూ ఆప్తమిత్రులయారు. ఈనాటికి గూడా 'చిత్ర' ఆడపిల్లో మగపిల్లవాడో నళినికి తెలియనే తెలియదు. వుత్తరాల్లో యెక్కడయినా దొరుకుతుందేమోనని నళిని ప్రతి వుత్తరం రెండుమూడుసార్లు చాలా నిశితంగా పరీక్షచేసేది. కాని ఫలితం దక్కలేదు. విసిగిపోయి చివరికి నళిని కోపంగా ఒకసారి యిలా వ్రాసింది.

'చిత్రా'

నువ్వు మగపిల్లవాడి వయినా, ఆడపిల్లవయినా నాకు బాధలేదు. నాకు కావాల్సిందల్లా నీ స్నేహం. అదిమటుకు ఎన్ని అవాంతరాలొచ్చినా మానుకోను. యే కారణంచేత నువ్వీ విషయాన్ని దాస్తున్నావో నాకర్థంగావటం లేదు. సరే! మొత్తానికి నీవు మానవజాతికే సంబంధించుతావు గదా? నీ యిష్టమైనప్పుడే తెల్సుకుంటాను.

—నళిని.

దానికి చిత్ర జవాబివ్వలేదు. నళిని తన్ను కాలేజి మాన్పించినతర్వాత ఇలా వ్రాసింది:

చిత్రా!

నన్నందరూ అన్నివిధాలా నాశనం చేస్తున్నారు. మా బామ్మ యేడుపులు, శోకాలు పెట్టి నాచదువు మాన్పించింది. మా బామ్మని మింగాలన్నంత కోపం వస్తోంది కాని యేం చెయ్యను, కాస్తాకూస్తామనిషి గాదయ్యె! యేం చెయ్యాలో తోచటంలేదు. బొత్తిగా కాలం గడవటం లేదు. ఇంక నీ వుత్తరాతే నాకు శరణ్యం.

నీ నళిని.

ఆ విధంగా మొదలయిన వాళ్లి స్నేహాకి చివరకు యే చిన్న విషయమైనా సరే చిత్రం తెలియజేసి, చిత్ర తన అభిప్రాయం తెలియజేస్తేగాని నళిని ముందుకు అడుగు వెయ్యనంత

# చిత్రనళినీయం

వరకూ వచ్చింది. జరిగిన ప్రతి సంఘటననూ చిత్రకు వుత్తరం వ్రాసుకోవటం ప్రస్తుతం నళిని ముఖ్య కార్యాలలో ఒకటి.

కమలావాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత నళిని తీరికగా చిత్రకు వుత్తరం వ్రాయటం మొదలు పెట్టింది.

చిత్రా,

ఈ పల్లెటూళ్ళో కాలం ఎలాగడుస్తుందిరా భగవంతుడా అనుకున్న నాకు ఆ సమస్య తీరి, చక్కని మార్గం దొరికింది. నేను అనుకున్న పని సక్రమంగానే నెరవేరింది. నెరవేరటమే గాదు అనుకోని విభిన్న ఫలితాలను గూడా చూశాను. ఈరోజు మధ్యాహ్నం యీవూళ్ళో పిల్లలు వచ్చారు. నిజంగా వాళ్ళెంత మంచివాళ్ళనుకున్నావు! ఉత్త నిష్కల్మష హృదయులు. రోజూ పాపం యింట్లో యెంతో చాకిరీ చేసి వాళ్ళ నాయనమ్మలతో గుళ్ళో చేరతారట. అక్కడ వీళ్ళు మాత్రం నేరుజట్టుగా కూర్చుని యే సినిమాను గురించో, లేకపోతే వూళ్ళో అమ్మలక్కలను గురించో ఖబుర్లు చెప్పుకుంటారట. వీళ్ళు నలుగురూ సరిగ్గా నా యీడువాళ్ళు. పాపం అవకాశాలులేక నిజంగా యీరోజుల్లో యెంతమంది పాడయిపోతున్నారో! రోజూ నాదగ్గరకు రమ్మనమని చెప్పాను. యేదో నాకొచ్చిన సంగీతం, చదువు వాళ్ళకి నేర్పాలని నాకు మహా ఆసక్తిగా వుంది. వాళ్ళు చాలా మంచివాళ్ళు. నాతో చక్కగా కలిసిపోతారు. నిజంగా యిక నీకు వుత్తరాలు వ్రాసే టైంగూడా నాకుండదు. నాకలాటి ప్రణాళిక తయారుచేసి యిచ్చి ప్రతివుత్తరంలోనూ నన్ను హెచ్చరించి నాలోని ఆసక్తిని మేల్కొలిపినందులకు నీకెలా కృతజ్ఞత తెల్పాలో నాకు తెలియటంలా. మళ్ళీసారి వేసంకాలంలో మావూరు రాకూడదూ? చిత్రా, ఇదంతా మాని మా బామ్మ యింట్లో చిందులు త్రొక్కుతోంది. ఇవాళ రాజగోపాలస్వామికి పది కొబ్బరికాయలు మొక్కుబడి కొట్టింది, నా మెదడులో తొలుస్తున్న పురుగును తొలగించివేయమని ప్రార్థిస్తూ. అబ్బో! అప్పుడే ఆరుదాటుతోంది. ఇంక స్నానంచేసి వీణ వాయించుకోవాలి. ప్రతి వుత్తరంలోనూ వీణ బాగా అభ్యాసం చెయ్యమని వ్రాస్తున్నావెందుకు? నీకు సంగీతం అంటే అంతయిష్టమూ? దాన్ని చెయ్యటానికి యీయింట్లో యెక్కువ అవకాశాలు లేవు చిత్రా. దాన్ని నేను కుంటుంటే యేమిటీ భోగంవాని గతియిట్లా మవ్వావు, అని బామ్మ సాధించిపోతోంది. ఆ సాధింపు వదలేదు బాబూ. అప్పుడు గూడా సంగీతానికి వినియోగించుకుంటుంది బామ్మ.

ఇంతటితో విశేషాలు లేవు.

—నళిని

దానికి చిత్రనుంచి కొత్త ఉత్సాహవంతమైన ధోరణిలో జవాబు వచ్చింది.

నళినీ—

వాళ్ళు మనమనుకున్నంత మంచివాళ్ళు కాకపోవచ్చు. బహుశా, తెలివితక్కువవాళ్ళు గూడా కావచ్చు. కాస్త జాగ్రత్తగా మెలగటమే మంచిది. ఏదయినా నీకు మెత్తనికి కాలక్షేపానికి మంచి అవకాశం. మీ బామ్మను అడిగానని చెప్పు. యిప్పటికైనా ఆవిడ చల్లని చూపు నామీదగూడా వస్తుందని ఆశిందుకున్నాను.

నీ,

చిత్ర

మర్నాడు రెండుగంటలు దాటేసరికి నలుగురూ వచ్చారు. నళిని అత్యంతోత్సాహంతో ఆహ్వానించింది. ఒక టైంటేబులు తయారుచేసుకున్నారు. మొదటి అరగంట చదువు, రెండవ అరగంట సంగీతం, 3వ అరగంట నాట్యం, నాల్గవ అరగంట ఆటలు. ఆ రోజు వారు వెళ్ళిపోయింతర్వాత తనలో ఒకవిధమైన ఆకర్షణ వుందన్నీ, దాని మూలంగానే వీళ్ళు తన దగ్గరకు వస్తున్నారని అనుకుంది. కాని నళిని యీ అభిప్రాయాన్ని త్వరలోనే మార్చుకోవలసి వచ్చింది. మొదటి వారంరోజులు నళిని చెప్పింది ఒక్క అక్షరం గూడాను, తప్పకుండా నేర్చారు. తరవాత ఒకరోజున కమల నాకు నాట్యం, ఆటలు వద్దు, ఆ కాలంగూడా చదువుకి వుపయోగిస్తానంది. నళిని యెన్నో విధాల చెప్పి చూచింది. కాని కమల వినలేదు. ఇంకా పైగా "మాఅన్నయ్య నన్నా నాట్యం చెయ్యమని వ్రాశాడు. అన్నయ్య మాట నాకుగూడా సబబుగానే తోస్తోంది." అన్నది. "యే అన్నయ్య. మకాలావున్నయ్య" నళిని కోపం పట్టలేక పైకి కక్కేసింది. ఆ సమయంలో తెలియని కమల అన్నయ్యమీద నళినికి వచ్చినకోపం అంతా యింతా గాదు. ఎన్ని చెప్పినా వినకపోవటం వల్ల యిక గత్యంతరం లేక నళిని తనే తగ్గింది. ఆ తర్వాత మూడోరోజున విమల "నేను ఆ పాడు డాన్సు చెయ్యలేను బాబూ!" అని కూర్చుని వూరుకుంది.

"యేం?" అంది నళిని యీసారి విమల నేమయినా సరే వదలకూడదని. "ఇదేమీ యేం లేదు. చిన్న కాలు కొంచెం నొ[illegible]ది. అయినా నీకు మళ్ళే ఆ కా[illegible], చేతులు తిప్పటం నాకు చేతగాదు బాబూ! నవ్వు ఆయాసం వస్తోంది." విమల తాపీగా ఒక పుస్తకం తీసి చదువుకోటం మొదలు పెట్టింది. వచ్చిన కోపం తమాయించుకుని నళిని మెల్లిగా చెప్పటం మొదలుపెట్టింది. "ఇదిగో! నాట్యం చెయ్యటంవల్ల శరీరానికి యెంత వ్యాయామమౌనో తెలుసా? మగవాళ్ళకు దండాలు, బస్కీలు వుంటాయి! ఆడవాళ్ళకి యీ నాట్యం. ఒక విధంగా మనశరీరాన్ని పోషించుకుంటూ, మరో విధంగా కళని పోషించటం జరుగుతుంది. చూడు నేనెంత తేలికగా నటిస్తున్నానో! అట్లా మీ రిప్పుడు చేయగలరా? ప్రయత్నించేస్తే యెవరికయినా ఫలితం దక్కుతుంది."

"నాకసలు ఆ నాట్యమంటేనే మంట. హాయిగా పైరుగాలికి, పల్లెటూరి వాతావరణానికి పెరిగిన యీ శరీరం అలాటివి భరించలేదు. అది మొదటి నుంచీ రావాలిగాని యిలా హఠాత్తుగా మొదలుపెట్టే అవయవాలు వంగకపోగా, యెక్కడైనా నొప్పి పుట్టించి, తిరిగి వాటికి సేవ చేయించుకుంటాయి. ఇహ నీ మొహమాటానికి యీ వారం పదిరోజులు చేశాను [illegible] అసలు నేను నడవటమే కొంచెం నెమ్మ[illegible] నడుస్తాను." విమల యెదురువుపన్యాసం యిచ్చి నిశ్చలంగా చూస్తూ కూర్చుంది.

"అయితే నా మొహమాటం యిప్పుడు లేదుగాబట్టి నేను చెప్పినపని చెయ్యవలెంటావుగదూ?" నళిని మొహం యెరుపు రంగుకు తిరిగింది.

"నీ యిష్టం బాబూ! యింకా వీణ చెప్తానంటే వస్తాను. లేకపోతే రానేరాను. మా అమ్మ రోజూ అసలు ఇక లేస్తుంది బాబూ!" నళిని గత్యంతరం లేక వూరుకుంది.

"మాఅమ్మ కేకలు వేస్తోంది, రోజూ యిక పనా?" అని శ్యామల మాటేసింది. నళినికి శ్యామలంటే బాగాయిష్టం. చెప్పింది త్వరగా బుర్రకెక్కించుకునేది శ్యామలొక్కతే. నళినికి యేమనాల్సినంత పనయింది. అన్నపూర్ణ సరేసరి అన్నిట్లో నెమ్మదే. ఇక డాన్సుచేసేవారు లేక ఆ ప్రోగ్రాం యెత్తేశారు. ఆ అరగంటా యేదో ఖబుర్లతో వెళ్ళిపోయేది. ఖబుర్లు చెప్పటంలో వున్నంత ఆసక్తి వీళ్ళకి యితరవిషయాల్లో యెందుకుండదోనని నళిని అనుకునేది. ఒకరోజు ఖబుర్లలో కమల "నాళ్ళ లక్ష్మి కన్పించటం లేదుటగా" అంది.

"అవును. రంగయ్యగారి సుబ్బన్న గూడా కన్పించటంలేదుట" విమల అర్థగర్భంగా చూస్తూ అంది. "అబ్బ! యేం విచిత్రాలో బాబూ! మరీపాడుగా [illegible] లోకం." అంది [illegible] నళినివాళ్ళ

బొమ్మలా వ్యంగ్యకంఠంతో. నళిని ముందర సన్నసన్నగా చివాట్లుపెట్టింది. "అలాంటి విషయాలు విని వూరుకోవాలిగాని, తర్కించి విమర్శించగూడదు. చేసిందికాస్త తప్పే అయినా యిలా ప్రతివాళ్లు విమర్శనలు సన్నసన్నగా మొదలుపెడితే యివే పెద్ద గాలిదుమారమై వాళ్లమీద విరుచుకు పడ్తుంది."

"నలుగురూ వున్నాంగా బట్టి అనుకున్నాం. అయినా యిందులో తప్పేముంది. లేని విషయం మనమేమీ కల్పించలేదుగా. అందరూ అనుకుంటున్నదే; ఉన్న విషయమే" కమల కాస్త యెదురు చెప్పింది.

"అది నిజమో అబద్ధమో నీకు పూర్తిగా తెలుసా? ఒక వేళ తెలిసినా అంతవ్యంగ్యంగా మాట్లాడుకోవటం దేనికి? ఒక వేళ నిజమైనా యేం? లక్ష్మికి సుబ్బన్న పరాయివాడు గాదుగా, స్వంత మేనమామేగా! అలాటప్పుడు చెప్పుకోవటం దేనికి?" నళిని తీవ్రంగా ప్రశ్నించింది.

"ఓయబ్బో!" విమల మూతివిరిచింది.

"అదిసరేగాని యింతకీ చిత్ర అబ్బాయా? అమ్మాయా?" కమల ప్రసంగంమార్చినా వ్యంగ్యం కన్పిస్తూనేవుంది. దానికి నళిని మాట్లాడలేదుకాని అడగటంలోగల వ్యంగ్యం అర్థంచేసుకున్న నళినిబుగ్గలు కెంపురంగు పులుముకున్నాయి. అది నిజమైతే యెంత బాగుంటుందో అనుకుంది నళిని. నళినిబుగ్గల మీద యెరుపుచూసి, కమలా, విమలలు ఒకరి ముఖం ఒకరు చూచుకొన్నారు.

మర్నాడు అన్నపూర్ణ ఒక్కతే రావటంచూసి 'వాళ్లేరీ?' నళిని చదువుకుంటున్న పుస్తకం అవతలపెట్టి అడిగింది.

"యేమో నాకు తెలియదు." అన్నపూర్ణ ముక్తసరిగా వచ్చినపనిచూచుకొని వెళ్ళిపోయింది. నళిని అవాళ చాలా నిరుత్సాహంగా గడిపివేసింది. ఆ రోజు రాత్రి చిత్రకు యిలా వుత్తరంవ్రాసింది.

చిత్రా,

నిజమే. నువ్వన్నట్లు వీళ్లని అర్థంజేసుకోవటం కష్టం. మనలాటివాళ్లు మనిషిలో మంచినిమాత్రమేచూసి దానితోమటుకే స్నేహంచేస్తారు. వీళ్లలాకాదు. ఇవాళ హఠాత్తుగా రావటం మానేశారు. రేపు బహుశా అన్నపూర్ణగూడా మానవచ్చు. ఎందుకు మానేస్తున్నారో నాకు తెలియటంలేదు. ఇది నాకు తీరనిసమస్యగావుంది. నీకేమయినా అర్థమైతే వ్రాయి

ఇట్లు,
తలనొప్పితోవున్న,
నీ
నళిని

అనుకున్నట్లుగానే అన్నపూర్ణ మానేసింది. కాని కారణం కబురుపంపింది తనకి జ్వరం వస్తోందని. ఇష్టం లేకపోయినా నళిని నమ్మక తప్పలేదు. ఒకరోజున వుండ బట్టలేక నౌకర్ని కమలావాళ్ళింటికి పంపింది. రాములు తిరిగివచ్చి నళినితో యేసమాధానం చెప్పకుండా తనపని తాను చూసుకోవటం మొదలుపెట్టాడు. బహుశా మర్చిపోయాడేమోనని తనే దొడ్లో గొడ్లని చూస్తున్న వాడిదగ్గరకు వెళ్ళి అడిగింది:

"ఏరా రాములూ, కమల యేమంది?"

రాములు ముఖం తిప్పుకుని "రాటానికి యీలు లేదంటమ్మా. ఇంకా యెప్పుడూ ఆ రమ్మాయికోసం ఆళ్ళింటికి రావద్దన్నారు." రాములు కళ్లలో నీళ్లు తిరిగాయి. నళినికిదేం అర్థంగాక "యేమిటిరా? అసలు సంగతేమిటి? కళ్లంబడి నీళ్లు పెట్టుకుంటా వెందుకు?" "యేం సెప్పమంటా రమ్మా. మీకేమో యీ మాయదారి ప్రపంచం తెలియదు. లోకంలో చాలా కుళ్లుందమ్మా. యెట్టాంటి కుళ్ళనుకున్నారు? ఛీ! చూసీ ఓర్వలేక..." రాములు ముఖం కోపంతో జేవురించింది. వాడు తొందర తొందరగా అక్కడినుంచి వెళ్ళిపోయాడు. నళిని తెల్లబోయింది. ఎంత ఆలోచించినా సంగతేమిటో అర్థంగావటంలేదు. ఒకవేళ యేమయినా తను కమలని అన్నట్లుగా చెప్పిందా కమల యింట్లో? ఛీ! కమ్మ




స్థానిక విక్రయ కార్యాలయం: 120, అర్మీనియన్ వీధి, మద్రాసు - 1
సిలోనుకు సోల్ యేజెంటు: మెసర్సు. రీమూసన్స్ లి॥ 17, న్యూ మూర్ స్ట్రీట్, కొలంబో-1.

(12-వ పేజీ తరువాయి)

చేతిలోంచి ఒకనయాపైసాకలిపి, శ్రీమతి చేతికి రెండునయాపైసలిచ్చేశాడు.

"ఎందుకురా బాబూ నీడబ్బులోంచి తీసిచ్చావు?" బెంగముహం పెట్టింది శ్రీమతి.

"మట్టిబుర్ర!" అనేసి యిక చేతికర్రతో ప్రవేటుచెబుతుందిగాబోలు అలా అన్నందుకు అని చప్పున నాప్రక్కకు గెంతుకున్నాడువాడు. "నావద్ద రెండుకాణీలు వుండినయి. వాటిరెంటికీ నరసయ్యతాత నాలుగునయాపైసలిచ్చాడు. నీకు ఒకటి యిచ్చానుఅనుకో. ఇక మూడునయాపైసలున్నాయిగదా నాఅర్ధణాకూను. పట్టికలో చూడు అర్ధణాకెన్ని నయాపైసలో." పట్టిక మీదికి వేలుచూపుతూ శ్రీమతివేపు కళ్ళు మిటకరించాడు వాడు.

"అర్ధణాకు మూడునయాపైసలే!" అంటూ ఆశ్చర్యపోయేసింది శ్రీమతి.

వాడితెలివికి నాగులోరి నరసయ్య, నేను దిగ్భ్రమగా నుంచుండిపోయాము—ఎలాంటికేసును ఎంతసూక్ష్మంగా తీర్పు చేశాడు అనుకుంటూ. నళిని ఏమిటా అని అయోమయంగా చూస్తూ నుంచుంది అందరి ముహాల్లోకీ.

"ఆబుడతడు షేలండీ మీకన్నా, చదివినవాడిపైన చాకలాడు మెరుగట." నరసయ్య వెళ్ళిపోయాక తనపుత్రుని తెలివి తేటల్ని ఆశరాగా చేసుకుని నామీద చెణుకులువిసరడం ప్రారంభించింది శ్రీమతి. "మీకామాత్రం యుక్తిలేదు."

"ఏడిశావు." బాబు తెలివికి నాలో నేను కూడా సంబరపడినా (వాడు నాకూ సుపుత్రుడే కనుక!) ఆడాళ్ళ ముందు అలుసయిపోవడం సహించలేక ప్రారంభించాను. "నావద్దకూడా రెండు కాణీలు వుంటే, నేనూ ఆపనే చేసివుండేవాడిని." అలా మాటవరసకు అన్నానేకాని అసలు సంగతి నాకూ తెలుసు. నేనే కనుక రెండుకాసులు తీసుకెళ్ళి "నరసయ్యా! నాలుగు నయాపైసలు యివ్వవయ్యా!" అనివుంటే "మన దేవూరయ్యా? అర్ధణాకు మూడేనయ్యా!" అని ముహంమీదే అనివుండేవాడు నరసయ్య. చిన్నవాళ్ళు గనుక వాళ్ళకు సరిపోయింది.

"ఆఁ!—ఆ మాత్రపు తెలివి మాకూ వుంది." నాకు ఏమాత్రమూ తగ్గిపోని నా శ్రీమతి మళ్ళీ ప్రారంభించింది. "మీ వద్ద రెండు కాణీలే వుండివుంటే ఓ కాణీ తీసి అణాబొట్టు వాని ముహాన పడేసి ఈ రాద్ధాంతమే లేకుండా చూసివుండేదాణ్ణి. వెధవది చిల్లర లేక యింతవరకూ సాగింది." సవాలుగా తన తెలివిని ప్రకటించింది వంటగదిలోకి వెడుతూ.

"అమ్మా! కాణీకి నయాపైసలివ్వవే" శ్రీమతి పమిట పట్టుకుంది నళిని.

"నాన్నా! కాణీకి నయాపైసలివ్వవూ?" అంగీ పుచ్చుకున్నాడు బాబు.

"ఎక్కడివిరా నీకు యిన్ని కాణీలు?" బాబు జేబులో గలగల లాడుతున్న కాణీల వేపు ఆశ్చర్యంగా చూశాను నేను.

"మరేమోనూ—మరేమోనూ నాన్నారూ?" మొదలెట్టాడు వాడు. "పోయిన మంగళవారం అమ్మ ఓ బేడ యిచ్చింది మాకు. కొట్టుకు వెళ్ళి దానికి నళిని, నేనూ కాణీలు తెచ్చుకున్నాము. రోజూ పాల రంగయ్య బాబాయి దగ్గరా, నరసయ్య తాతయ్యదగ్గర కాణీకి రెండేసి నయాపైసలు తీసుకుంటూ వుంటాము గదా. అలా నాలుగు కాణీలకు ఎనిమిది వస్తాయి. వాటినేమోను మళ్ళీ పేపరు తాతయ్యకి యిచ్చేసి ఎనిమిదింటికీ అణా కాణీ తీసుకుంటాము. దాంతో మాకు అణాకు కాణీ లాభం వస్తుందిగదా. వాటిని అలానే దాచుకుని ఆ కాణీకి చాకలెట్లో, పెప్పర్‌మెంట్లో కొని తినేస్తాము." సంతోషంతో గంతులేస్తూ ప్రసంగం ముగించాడు బాబు.

"హారివెధవా! ప్రతీరోజూ పాలవాడి దగ్గర నయాపైసాలు మార్చుకోడం ఇదా మీ పని!!" బోలెడు ఆశ్చర్యపోయేసింది మా శ్రీమతి.

"25 శాతము లాభము. ఎక్సలెంటు." అంటూ యింకా ఆశ్చర్యపోయేశాను నేను.

"నయాపైసా నాణెమయా
లాభసాటి బేరమయా
బాలులంతా రండి భయ్యా!
కాణీలన్ని చేర్చుడయా
అణాకొక్క చాకలేటు
అమాంతముగ మిగులునయా."

చప్పట్లు చరుస్తూ నళిని, బాబు డాన్సు ప్రారంభించారు. "అహో! శ్రీమతీ!!" అంటూ వాళ్ళ తెలివితేటలకు ఆశ్చర్యాన్ని ఆపుకోలేక బిక్కముహం వేశాను నేను.

"కలికాలంగద స్వామీ!" అంటూ తృప్తి పడిపోయింది ముక్కుమీద వేలుంచుకున్న ఆ మంగళాంగి. ★

# చిత్రనళినీయం

"ఏమిటమ్మా అది! సరిగ్గా చెప్పు" తండ్రి కంఠంలో ఆదుర్దా విన్పిస్తోంది.

"ఏం చెప్పనురా బాబూ! యేనాడయినా వుందా? ఆ రాజగోపాలుని దయ మనమీద తప్పిందిరా నాయినా. గుళ్ళో ప్రతివాళ్ళూ అడగటమే."

"యేమిటమ్మా అది. నువ్వు చెప్పకుండా వూరికే యేడుస్తే నాకేం తెలుస్తుంది?" తండ్రి గర్జనకి నళిని హృదయం గజగజలాడింది, బామ్మ యేం చెబుతుందోనని. బామ్మ యేడుపును కాస్త ఆపి ఉత్తరాలటరా బాబూ! రోజూ మన నళినికి యెక్కడి నుంచో వస్తున్నాయట. అవేం వుత్తరాలో మరి భగవంతుడికి తెలియాలి. మనకి తెలియందే ఆ దిక్కుమాలిన వాళ్ళకి యెలా తెలిసిందో?" మళ్ళా శ్రుతి సరిచేసుకుని రాగాలాపనకి ఉపక్రమించబోతుండగా "ఉత్తరాలు! యెక్కడి నుంచమ్మా" తండ్రి కంఠం కొంచెంగా కంపించింది.

"విశాఖపట్నం నుంచిటరా. అన్నీ వాళ్ళకెలా తెలిశాయో మరి?"

"విశాఖపట్నంనుంచే కదా అమ్మయ్యా. నన్ను ఖంగారుపెట్టేశావే. అమ్మా విశాఖపట్నం నుంచయితే ఫర్వాలేదు. ఆ రాజగోపాలుని దయ మనమీద సరిగ్గానేవుంది. నువ్వేం భయపడ నవసరంలేదు. నిశ్చింతగా వుండు. దానిపెళ్ళి సలక్షణంగానే అవుతుంది." నాన్నగారి కంఠంలో తేలిక కన్పించింది. నళినికి ఒక్కసారి విరగబడి నవ్వాలనిపించింది. కాని నవ్వలేకపోయింది. అక్కడ నిలబడలేక భారంగా అడుగులు వేసుకుంటూ తన గదిలోకి వెళ్ళిపోయింది. తనమీద యిలా ప్రచారం అవుతోందన్నమాట. కమలా వాళ్ళెందుకు మానేశారో నళినికి సులభంగా అర్థమయింది. వెంటనే ఆవేశంతో చిత్రకు వుత్తరం వ్రాయటం మొదలుపెట్టింది. ★

[మిగతా కథ వచ్చేవారం]

**OMI SEWING MACHINES**

డీలర్లు కావలెను. అసక్తికలవారు వివరములకు వ్రాయగోరడమైనది.

Omi Engineering Works. Ludhiana

మహాశక్తి లేహ్యం

రుచికరమైనది. బలకరమైనది పిల్లలకు. పెద్దలకు. ఉపయోగపడు శాస్త్రీయ ఔషదము. అందం. బలం. సౌఖ్యం విచ్చును. నిరపాయమైనది. 10 తు॥. రూ 4/50; 20 తు॥. రూ 7 పోస్టేజి:రూ 1/25.

MAHASAKTI AYURVEDASRAM (A), 9/3 Chadi tola Le., Calcutta-40.

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.



# చిత్ర నళినీయం

**యద్దనపూడి సులోచనారాణి**

[గతసంచిక తరువాయి]

చిత్రా,

నువ్వెంతపని చేశావో చూసావా? నేను తలపెట్టిన కార్యం అలా మధ్యలోనే ముగిసిపోవటానికి కారణం తెలియక యిన్నాళ్లూ రాత్రింబవళ్లు తల పగలకొట్టుకుంటున్నా అర్థంగాలేదు. ఇప్పుడు మా బామ్మ పుణ్యమా అని తెలిసింది. దానికి నీ వుత్తరాలే కారణం. కాని చిత్రా, యే వుత్తరాలయితే యీపని చెయ్యటానికి వుపయోగించాయో ఆ వుత్తరాలే ఆ పని మధ్యలో నిల్చిపోవటానికి కారణమైతే చిత్రంగదూ! ఈ వార్త వింటుంటే అందరిలో నిలబడి అసలా వుత్తరాలే యీ పని మొదలుపెట్టటానికి కారణమని గొంతు చించుకుని అరవాలనిపిస్తోంది. ఇంతగ్రంథం జరుగుతున్నా చివరికి నువ్వు మగపిల్లవాడివో ఆడపిల్లవో నాకీ క్షణం వరకూ నిజంగా తెలియనే తెలియదు. నాకింక పెళ్ళిగాదని మా బామ్మ దిగులుపెట్టుకుంది. మా నాన్నగారు నువ్వు ఆడపిల్లవనే అనుకుంటున్నారు. ఆడపిల్లవైతే ఒకసారి తప్పకుండా యిక్కడికిరా! మరి మగపిల్లాడివైతే—యేమో చెప్పలేను. నాకప్పుడు యేం చెయ్యాలో తెలియదు. వెంటనే వుత్తరం వ్రాయి. నీ మూలంగా యిక్కడ నేను అపఖ్యాతిపాలవుతున్నా. ఇందులో సగం నువ్వుగూడా పంచుకోవాలి. బాధ్యత గుర్తిస్తే వెంటనే బయలుదేరిరా. ఇంతకంటే నేను యిప్పుడు వ్రాయలేను. నీలో విశాల భావాలూ, నాపైనందు వున్న ఆత్మీయతా చూపించటానికిదే సమయం.

నీకోసం యెదురుచూస్తున్న,

నీ, నళిని.

దానికి వెంటనే జవాబువచ్చింది. నళిని గుండె గుబగుబలాడింది. అనుకోకుండానే యెందుకో బుగ్గలు గులాబిమొగ్గలయాయి. ఉత్తరం తీసుకుని గదిలోకి పరుగెత్తి మంచం మీద వాలి చదువుకోవటం మొదలుపెట్టింది.

నా నళినీ,

ప్రతిసారీ 'ప్రియమైన నళినీ' అనే చిత్ర యీసారి నా నళిని అంటోందే అనుకుంటున్నావా? దానికి కారణం నీదగ్గరకు వచ్చినప్పుడు చెబ్తాను. జ్ఞాపకముంచుకుని అడుగు. నీతో నేను స్నేహం మొదలుపెట్టే రోజున మన స్నేహం యిలా నీమీద విరుచుకుపడ్తుందని దాంతో నీ భవిష్యత్ నాశనమవుతుందని మీ బామ్మ తారస్థాయిలో శోకాలుతీస్తుందని కలలోగూడా అనుకోలేదు. కాని అంతా విధివిలాసం. నీలో కార్యశూరతవుంది. కాని దాన్ని నీకు నువ్వే మేల్కొలుపుకోలేవు. ఈ శెలవుల్లో మీవూరు తప్పకుండా వస్తాను. కాని మీ బామ్మ రానిస్తుందా? అయినా నన్ను చూసిన తర్వాత మీ బామ్మ తప్పకుండా దేముడికి కనీసం ఒకడజను కొబ్బరికాయలన్నా కొడ్తుందని నా నమ్మకం. మరి నువ్వెలావుంటావో? ప్రత్యక్షంగా చూడాలని వుంది. మీ బామ్మ ముందు రానిచ్చి తర్వాత కొబ్బరికాయలు కొట్టినా ఫర్వాలేదు. అంతగా అయితే తర్వాత మనిద్దరం కలిసి అంతకు రెట్టింపు కొట్టవచ్చు. అసలు నేనెలాగూ యీ శెలవుల్లో మీవూరు రావాలనుకుంటున్నాను. కాని యింకా అనుకోవటంలోనే వున్నాను. నీ వుత్తరం దానికి ఒక స్థిరరూపాన్ని యిచ్చింది. పరీక్షలు అయిపోతున్నాయి. ముందు మావూరు వెళ్లాలి. అక్కడినుంచి మీవూరు. సరే మిగతా విషయాలు ముఖాముఖిని మాట్లాడుకుందాం. పరీక్షలకు నీ ఆజ్ఞానుసారం బాగానే చదువుతున్నాను.

ఇంతే,

ఇక చదువుకోవద్దు మరి?

పు.రా: నేను వచ్చినప్పుడు రంభలాగా డాన్సుచేసి (మీ బామ్మ చూడకుండా.) సరస్వతిలాగా వీణవాయించాలి (దీనిని మీ బామ్మ చూస్తేనుగానే). అలాగని ముందర మాటయిస్తేనే వస్తాను.

చిత్ర.

నళిని వుత్తరాన్ని రెండు మూడుసార్లు చదివి తన్లో తను తర్కించుకుంది. కాని కొన్ని విషయాలు మగపిల్లవాడని నిరూపిస్తే మరికొన్ని ఆడపిల్లని ఖండితంగా చెబుతున్నాయి.

నళిని దానికి జవాబిలా వ్రాసింది.

చిత్రా,

నిన్ను చూడగానే మా బామ్మ తప్పకుండా కొబ్బరికాయలు కొడ్తుంది అంటున్నావు గాబట్టి నువ్వు బహుశా ఆడపిల్లవనే నమ్ముతున్నాను. మగవాళ్ళకింత ఆటపాటలయందు ఆసక్తి వుండదు. నీకోసం యెల్లవేళలా మా తలుపులు తెరిచేవుంటాయి. శెలవులివ్వగానే మీ వూరుగూడా వద్దు, సరాసరి మా వూరు వచ్చెసెయ్. మరీ మరీ అడుగుతున్నాను. వచ్చేముందు ఒక చిన్న ఫోటో పంపవూ? తప్పకుండా పంపిస్తావని ఆశిస్తున్నాను.

నీకోసం యెదురుచూసే

నీ

నళిని.

మూడోరోజు టపాలో వుత్తరం, ఫోటో రెండూ వచ్చాయి. కాని ఫోటో కవరప్ చేసి దానిపైన 'వుత్తరం చదివి ఫోటో చూడు' అని యింగ్లీషులో వుంది. నళిని గబగబా వుత్తరం తీసింది.

నళినీ,

అసామాన్యమైన కోరికలు కోరుతున్నావు. సరే. ఫోటో పంపుతున్నాను. నీ వుత్తరాల ధోరణి చూస్తుంటే యేవో చాలా ఆశలు పెట్టుకున్నట్లుగా తోస్తోంది. నీ కోరిక చూస్తుంటే మీరరానిదిగా వుంది. నన్నన్ని విధాలా బంధించుతున్నావు. ఇది నాకున్న ఒక్క ఫోటో. ఈసారి నుంచిదిపంపుతాను. ఒకసారి మల్లెపూలజడ వేసుకుంటె వెనకనుంచిమామయ్య తీసాడు.

నీ

చిత్ర.

# ★ చిత్రనళినీయం ★

ఫోటో చూడక్కర్లేదనుకుంటూనే తీసేసి మూసింది. నళిని ఆలోచనా శిఖరాల నుండి ఒక్కసారి క్రిందికి దొర్లిపోయి ఫోటోవంక అలా శూన్యంగా చూస్తూవుండిపోయింది. ఫోటోలో ముఖం కన్పించటం లేదు. జడా పూలు యేదో గళ్ళ జాకెట్ కన్పిస్తున్నాయి. అనుకోకుండా నళిని హృదయంలోంచి బరువుగా ఒక్క నిట్టూర్పు బయటకు వచ్చింది. అందులోని చిత్రం అంటే తనకున్న కల్పనాభావం ఆనాటితో కరిగిపోయినట్లనిపించింది. గుండెల్నెవరో బలవంతంగా నొక్కుతున్నట్లు ఒకవిధమైన బాధ బయలుదేరింది. "చిత్ర! చిత్రంగానే ప్రవర్తించింది. తను ఆడపిల్లన్న సంగతి రెండుసంవత్సరాల క్రితమే తెలియజేస్తే యెంత బాగుండేది. ఏమీ లేకుండానే యీ వూళ్లో తనెంత అపవాదు మోస్తోంది. చిత్ర యెవరో తెలియకముందు ఆ అపవాదులో ఒక విధమైన మాధుర్యం వుండేది. ఇప్పుడది లేదు. నిజంగా చిత్రెవరో తనకు తెలియకుండా వుంటేనే బాగుండేది. తెలిసినా చిత్ర ఆడపిల్ల కాకపోతే తను సంతోషించేదేమో. నళినికి యీ వూళ్ళో వాళ్ళందర్నీ పిలిచి చిత్రని చూపించాలనిపించింది. కాని వాళ్ళు నమ్ముతారా? తాము అంటున్నాం గాబట్టి యెవరో అమ్మాయిని తీసుకువచ్చింది అనుకుంటారు. చిత్రమీద మొదటిసారిగా నళినికి అంతులేని కోపం వచ్చింది. కాగితం తీసుకుని గబగబా వుత్తరం వ్రాయటం మొదలుపెట్టింది.

చిత్రా,

నీ పేరుకుతగ్గట్లు చిత్రంగానే ప్రవర్తించావు. నీఫోటో చూచాను. చాల సంతోషించాను. ఏమీ లేకుండానే, ఎవరి ప్రమేయం, సంబంధం నాకు లేకుండానే యీ వూళ్లో నా పేరుకు మసి పూసుకున్నాను. ప్రతి వుత్తరంలో నువ్వు కావాలని నాలో అనుమానాలని రేకెత్తించివుంటావు. నువ్వు మగపిల్లవాడివిగా వూహించుకునేందుకు నాకు ఎన్నో అవకాశాలను చిత్రించావు. చివరకు నా వుత్తరం చూసి బహుశా నీలో నువ్వు చిరునవ్వు నవ్వుకుంటావనుకుంటాను. అది నా ఉద్దేశంలో చిరునవ్వు గాదు పైశాచిక నవ్వు. చిత్రా ఇది నీకు ఆనందాన్నిస్తోంది కదూ? అది మామూలు ఆనందం గాదు. అందులో ఒక విధమైన రాక్షసత్వం వుంది. నువ్వు చాలా తెలివిగలదానివని నేను ఒప్పుకుంటున్నాను. లేకపోతే రెండుసంవత్సరాలు నీతో ఉత్తర, ప్రత్యుత్తరాలు జరుపుతూ నిన్ను తెలుసుకోలేకపోతానా? మగపిల్లవాడివైతే నిన్ను పెళ్లి చేసుకుని వూళ్లో గలిన అపవాదును తొలగించుకుందామనుకున్నాను. ఇప్పుడు నాకు మరో పెళ్లయినా ఇదివరకు ఎవరికో విశాఖపట్టణం ఉత్తరాలు వ్రాసేదనేవారు మానతారా? మానరు. ఏమీ లేకుండా నాకు కళంకం కల్గింది. దీనికి నువ్వేం సమాధానం చెప్తావు చిత్రా. నీసాటి ఆడపిల్లను గదూ! ఇలాంటి అవమానం జరిగితే సహజంగా ఆడపిల్ల ఏంచేస్తుందో ఆలోచించగలవా?"

నళినికన్నీటిబొట్లు ఉత్తరంమీదపడి అక్షరాలని చెరిపివేశాయి. వాటిని ఇంక్ తో సరిదిద్ది మళ్లా వ్రాయటం మొదలుపెట్టింది. "నాది గొప్పహృదయం గాబట్టి నాతో స్నేహం చేస్తానన్నావు. నీమూలంగా నాకు కళంకం కల్గినా నీతో స్నేహం వదులుకోను. ఇంకా హృదయ రహస్యాలు గూడా వ్రాసి నా గొప్పతనాన్ని మరోసారి ఋజువు చేసుకుంటాను. కాని యీసారయినా సద్వినియోగపర్చుకో.

ఇంతే,
నళిని.

చిత్రనుండి వెంటనే జవాబు వచ్చింది:

నా నళినీ,

నామీద అంత ఆగ్రహం వచ్చిందే నేనేం చేశాను? నేను నీకు మొదటే వ్రాశాను మనకు లింగాల్లో భేదం వుండకూడదని. కాని నువ్వు నామీద ఆశలు పెట్టుకున్నావు. దానికి నేనేంచేయ్యను? మగపిల్లవాడివైతే పెళ్ళిచేసుకునేదానివా? ఎంత విచిత్రంగా మాట్లాడుతున్నావు. ఎంత ధీమాగా గొప్పతనాన్ని వెళ్లబోసుకున్నావు. మంచిది నేను వస్తాను. నన్ను చూసి నా చిరునవ్వు చల్లని వెన్నెలనిస్తుందో పైశాచిక విస్ఫులింగాలు వెదజల్లుతుందో స్వయముగా చూదువుగాని. తీవ్రంగా ఆశాభంగం పొందినవాళ్లెంతర్థంలేకుండా మాట్లాడుతారో చక్కగా నిరూపించావు. నాకోసం ఎల్లవేళలా మీ తలుపులు మరి ఇప్పుడుకూడ తెరిచివుంటాయా? నన్ను క్షమించి ఇంకా నాతో స్నేహంచేస్తున్నందుకు నా కృతజ్ఞత యెలా తెలపాలో తెలియటంలేదు. శెలవిచ్చారు.

కోపంతో వున్నప్పుడు నీముఖం
చూడాలనే కుతూహలంతో వున్న,
నీ,
చిత్ర.

వారంరోజులు తర్వాత నళిని ఒకరోజు రాత్రి చిత్రకి వుత్తరం వ్రాసింది,

చిత్రా,

ఏ కారణంచేత నువ్వు నన్నిలా ఆకర్షిస్తున్నావో నాకు తెలియటంలేదు. మా నాన్నగారో సంబంధం తీసుకువచ్చారు. అతను గూడా విశాఖపట్నంలో డాక్టరు చదువుతున్నాడు. బహుశా నీకు తెలిసేవుంటుంది. కాస్త అందమైన విగ్రహమే అనుకోవచ్చు. పేరు రవికుమార్. కమల లేదూ? ఆ అమ్మాయి పింతల్లి కొడుకు. నన్ను చూసి చేసుకుంటానంటున్నాడు. కట్నంగూడా వద్దట. అంత ఆకర్షణ యీ ముఖంలో యేం కన్పించిందో మరి. తాంబూలాలు పుచ్చేసుకున్నారు. నాతో మాట్లాడాలని అవకాశం యిప్పించమని నాన్నగార్ని అడిగాడట. తర్వాత తెలిసింది. నేను రోజూ సాయంత్రంపూట సన్నజాజిపూలకోసం మా తోటలోకి వెళ్తాను. నిన్నగూడా అలాగే వెళ్ళాను. అక్కడకు వచ్చి అతనుగూడా వున్నాడు. నేను వెనక్కు తిరిగి గబగబా వచ్చెయ్యబోతుంటే "మీతో మాట్లాడాలని వచ్చాను. వెళ్ళిపోకండి" అన్నాడు ప్రాధేయపూర్వకంగా. నే నాగిపోయాను. సన్నజాజి పందిరికి నేనీ చివరా, అత నాచివరా నుంచుని వున్నాం.

"నన్ను చేసుకోవటం యిష్టమనే అనుకుంటున్నాను" అతను సన్నజాజి మొగ్గని



మృదువుగా గిల్లుతూ అన్నాడు. నేను మాట్లాడలేదు. నిష్సంకోచంగా అతని వంక చూస్తున్నాను. అసలే నాకు యీ జన్మలో పెళ్ళిగాదని శోకాలు పెట్టున్న మా బామ్మ యితనిని చూస్తే రాజగోపాలస్వామికి యెన్ని కొబ్బరికాయలు కొడ్తుందో అని అంచనా వేస్తుండగా "చెప్పండి. మరేం ఫర్వాలేదు. సందేహించకండి" లాలిస్తున్నట్లుగా అన్నాడతను. నే నక్కడ నుంచో లేక యింట్లోకి పారిపోయి వచ్చాను. యెందుకు? సిగ్గుపడి గాదు చిత్రా, గుండెల్ని పిండే బాధతో, నా వ్యధిత హృదయం అతనికి కనిపిస్తే మరో విధంగా అర్థం చేసుకుంటాడని పారిపోయి వచ్చాను. లోతుల్ని కొలిచే అతని కళ్ళకి అందనిదంటూ వుండదనిపించింది. నా బాధెందుకో తెలుసా చిత్రా. నీకోసం. అతని అందాన్ని, ధీరత్వాన్ని నాకు యింత సన్నిహితంగా వున్న నీలో ఆసించాను. కాని అవి నీలో నాకు అందలేదు. పరాయి పురుషుడిరూపంలో అంగుతున్నాయి. అందం, ఆనందం దొరికినచోట మనసు, మమత నాకు లభించలేదు. లగ్నాలుగూడా నిశ్చయించారు. 13 వ తారీఖున నా వివాహం జరుగుతుంది. అప్పటికి నీకు శెలవిచ్చి చాలారోజులవుతుంది. ఈ వివాహానికి తప్పకుండా రా. నీలోని గుణాలు యెలాటి వ్యక్తిలో ఆసించానో తెల్సుకుందువుగాని.

నీ,

నళిని.

వారం తిథి బాగా లేవని మూడురోజుల ముందరే నళిని బామ్మ నళినిని పెళ్ళికూతురు చేయించింది. పెళ్ళి సలక్షణంగా కావాలని ముందర యింట్లో పెళ్ళికూతురుచేత, తర్వాత గుళ్ళోను మొత్తం ఓ 50 కొబ్బరికాయలు రాజగోపాలస్వామికి ముట్టాయి. నళిని చిత్ర కోసం యెదురుచూస్తుంటే కాస్త ఆలస్యంగా చిత్రనుండి వుత్తరంమాత్రమే వచ్చింది. ఇల్లంతా చుట్టాలు, స్నేహితులు అంతా నానా హడావుడిగా వుంది. కమల మళ్ళా రాకపోకలు సాగించింది. పెళ్ళి పందిట్లో నళిని చిత్రఫొటో చూపించి అందరికీ యీ అమ్మాయే విశాఖపట్నంనుంచి వుత్తరాలు వ్రాసేది అంది. అంతకుముందు నళినిమీద అభాండాలు వేసినవారందరూ ముఖాలు ప్రక్కకు తిప్పుకున్నారు ఫొటో చూడటాని కిష్టంలేక. కమలకి కొంచం వుపన్యాసం యివ్వాలనుకుంది నళిని. కాని తీరా చూస్తే కమల అక్కడ కన్పించలేదు. ఇంతలో చిత్ర నుండి వుత్తరం వచ్చింది. తన గదిలోకి పోయిన నళిని చదువుకో సాగింది.

ప్రియాతిప్రియమైన నానళినీ,

బహుశా నీకిది నా ఆఖరి వుత్తరం అనుకుంటాను. నీ పెళ్లికి బహుశా రావటం వీలుగాదేమో. కాని సాధ్యమైనంతవరకూ రావటానికి ప్రయత్నం జేస్తాను. ఇప్పుడు సరాసరి మావూరు వెళ్లిపోతున్నాను. ప్రస్తుతపు పరిస్థితులలో నా యడ్రస్ నీ కివ్వలేను. అందుకు క్షమిస్తావనే ఆసిస్తాను. తిరిగి తొందర్లో నా అడ్రస్ యిస్తూ వుత్తరం వ్రాస్తాను. రవిని గురించి విన్నానుగాని చూడలేదు. అందగాడని నా స్నేహితులంటుంటే విన్నాను. కాని నీకు భర్తగా లభించుతున్న అతని అదృష్టంమటుకు సాటిలేనిదని నా అభిప్రాయం. నాకు మెయిల్ కి టైమవుతోంది. మీ కాబోయే నూతన దంపతులకు నా హృదయపూర్వక అభివందనలు.

నీ,

చిత్ర.

ఊ తరాన్ని గురించి యెక్కువగా ఆలోచించటానికి నళినికి టైం లేకపోయింది.

వాళ్లబామ్మ కొటిన కొబ్బరికాయల ఫలితంగాని లేక ముహూర్తబలంగాని నళిని పెళ్లి సలక్షణంగా అనుకున్న ముహూర్తానికి ముచ్చటగా, వేడుకల్తో ముగిసింది. యెంత సంతోషంలో వున్నా నళినికి ఒక చెవి ఒక కన్ను పరధ్యాసగానే వున్నాయి. కాని చిత్ర రాలేదు సరిగదా మళ్లా వుత్తరం గూడా వ్రాయలేదు. క్రమంగా రోజులు, గూడా దొర్లిపోయినాయి. నళిని రవి కిదేమీ చెప్పలేదు. కాని ఒకరోజునమటుకు అడిగింది. వూళ్ళోవాళ్ళు తనమీద యేమీ చెప్పలేదాని. రవి యీ ప్రశ్నకు జవాబివ్వకుండా వెళ్లిపోయాడు. నళినికి బాధ కల్గింది. ఎందుకు చెప్పరు. చెప్పినా లెఖ్ఖచెయ్యకుండా తన్ని చేసుకున్నాడన్నమాట. నళినికి కృతజ్ఞతాభావంతో కళ్లల్లో నీళ్ళు తిరిగాయి.

ఒకరోజు నళిని పట్టలేక రవిని అడిగింది చిత్ర అనే అమ్మాయిని గురించి తెలుసునా అని.

"అమ్మాయిల్ని గురించి తెలియదు గాని, అబ్బాయిల్లోనే చిత్ర అనే పెన్ నేమ్ గల వాడొకడున్నాడు" అన్నాడు రవి సహజంగా. నళిని ఆకాశాన్నుంచి క్రింద పడ్డట్లనిపించింది. ఇంతలో కమల అక్కడికి రావటంతో భార్యాభర్తలు సంభాషణ ఆపేశారు. కమల కాపురానికి వెళ్తూ త్రోవలో అన్నగారి దగ్గర దిగింది. మళ్ళా వెళ్లిపోవటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. రవి కమలకి మంచి చీరా జాకెట్ తెచ్చాడు. కమల భర్తకు గడియారం కొనుక్కోమని డబ్బిచ్చాడు. భర్త ఉదారత్వానికి నళిని మురిసిపోయింది. వెళ్లబోతూ కమల హఠాత్తుగా నళిని పాదాలమీద వ్రాలి 'వదినా నన్ను క్షమించు. తెలియక నిన్నుగురించి అమ్మవాళ్లతోబాటు నేను గూడా వాగాను.' నళినిముఖం జేవురించింది. వెనకాల రవి వచ్చి నిలబడిన సంగతి యిద్దరూ చూడలేదు,

"నిన్నని లాభంలేదు కమలా. ఇది కేవలం నా దురదృష్టం. అయితే అది మీ అన్నయ్యకు గూడా తెలుసా?" కమల తెలుసునన్నట్లు తలూపింది. నళిని భారంగా నిట్టూర్పు విడిచి "ఇందులో యేమీ లేదని చెప్పినా ఆయన నమ్మరేమో బహుశా. అవాళ నీకు చూపించానా చిత్రఫొటో?" కమల చూపించలేదన్నట్లుగా తలూపింది. 'రా అయితే చూపిస్తాను. నా పెళ్లికాక ముందు ఒక వుత్తరం వ్రాసింది. మళ్లా వుత్తరం గూడా వ్రాయలేదు. బహుశా పెళ్లి అయిందిగదాని మానేశాదేమో?" నళిని తనకు తనే వులిక్కిపడి కమల ముఖంలోకి చూసింది. కమల యిది గ్రహించే పరిస్థితులలో లేదు. తన చీరఖరీదు యెంతుందో అంచనా వేసుకుంటోంది, "నాకు తొందరలో చావుకలితే చాలా బాగుంటుంది" నళిని శూన్యంలోకి చూస్తూ అంది. 'నళినీ!' వెనకనుంచి బిగ్గరగా రవి కేక పెట్టాడు. చీర ఖరీదు లెక్కవేస్తున్న కమల, శూన్యంలోకి చూస్తున్న నళిని వులిక్కిపడి వెనక్కి తిరిగారు. రవి చేతులు చాచి నళిని పట్టుకున్నాడు. యేడుస్తూ నళిని తన ముఖాన్ని అతని వక్షస్థలంమీద తలదాచుకుంది "నా




లల్లూరాం అండ్ కంపెనీ
(స్థాపితము 1928.)
ఎన్నో సంవత్సరాలుగా మన్నికకు, నాణ్యతకు, సరసమైన ధరలకు ప్రసిద్ధిచెందిన
* ఇనుప పెట్టెలు * ఉక్కుబీరువాలు
* క్యాష బాక్సులు
లల్లూరాం అండ్ కో,
వెలగలేటివారి వీధి, విజయవాడ - 1. క్రొత్తషోరూమ్ - మారుతి సినిమా కెదురుగా.

# ★ చిత్రనళినీయం ★

నుండే యిలాంటి మాటలు మాట్లాడుతున్నావా? నీమీద. నాకేమీ అనుమానం లేదు నళినీ. నిన్ను హృదయపూర్వకంగా నమ్ముతున్నాను. చిత్ర మగవాడని తెలిసినా గూడా నన్ను బాధించటం లేదు. ఇంకపైగా ఆ సంఘటన తల్చుకున్నప్పుడల్లా నా మనసు పరవశత్వంతో పొంగిపోతుంది. నీవు చిత్ర ఒకటి, నేను ఒకటిగాదు. చిత్రని గురించి నువ్వేమీ చెప్పకపోయినా నాకంతా తెలుసు. నా ఆనందాన్ని నీకెలా తెలియ జెయ్యాలో తోచటం లేదు." అతని కళ్లల్లో ఆనందాశ్రువులు నిల్చాయి. కమల అక్కడి నుంచి తప్పుకుని వెళ్లిపోయింది. అతని వుదార హృదయాన్ని యేవిధంగా అర్థం జేసుకోవాలో నళినికి తెలియలేదు.

కమలావాళ్లు వెళ్లిపోయినతర్వాత ఒక రోజున సాయంత్రం రవి యింట్లో లేని సమయంలో నళిని యేమీతోచక అతని లైబ్రరీ రూమ్‌లోకి వెళ్లింది. నళిని సాధారణంగా అక్కడికి వెళ్లదు. తనకు కావాల్సిన పుస్తకాలు రవే యివతలకు తీసుకొచ్చి యిస్తాడు. పుస్తకాలని యెవరిని పట్టే వాళ్లని రవి ముట్టుకోనివ్వడు. నళిని యీ నిబంధనకు తనుకూడా తలొగ్గింది. ఇవాళ తప్పనిసరికి వెళ్ళింది. రవి తొందర తొందరగా బట్టలు మార్చుకుని వెళ్లాడులా వుంది. విడిచినబట్టలు సోఫాలో గిరాటుకొట్టివున్నాయి. నళిని ఆ బట్టలుతీసి మూలనున్న బుట్టలో వెయ్యబోతూ అలవాటు చొప్పున జేబులు చూసింది యేమయినా వున్నాయేమోనని. చొక్కా జేబులో తాళంచెవులు గుత్తీ, చిల్లరడబ్బులు జేబురుమాల, మరో చిన్న తాళం చెవీ వున్నాయి. ఆ చిన్న తాళంచెవిని గురించి యెన్నిసార్లడిగినా, అతను చెప్పలేదు. నవ్వుతూనే తోసేస్తున్నాడు. నళినికి అనుమానం వేసి తిన్నగా ప్రక్కకు తిరిగి అతని రూంలోకి వెళ్ళింది. అక్కడ స్టాండుకు బట్టలు, ఒక డ్రాయరు, కుర్చీ తప్ప యేమీలేవు. నళిని కాస్త కష్టపడి డ్రాయర్ను తెరిచింది. అందులో ముందరగా అతడి డైరీ కనిపించింది. అందులో ఒకచోట నళిని దృష్టి ఆగిపోయింది. అందులో "నేనే చిత్రనని నళినికెలా తెలియబర్చాలో తెలియటం లేదు." క్షణంసేపు నళిని కళ్ళు బయర్లు కమ్మినాయి. తిరిగి మళ్లా చూసింది. అసలు శబ్దాలకు అర్థం లేదనిపించింది. డైరీని ఇవతలకు లాగి ఇంకా యేమున్నాయోనని చూసింది. ఎత్తు చాలా తక్కువగా వుండి ఒక సన్నని పొడుగాటి పెట్టె వుంది. దానిని ఎలా తెరవాలో నళినికి తెలియలేదు. తర్వాత ఆకుపచ్చగా బైండుచేసిన ఒక పుస్తకం కన్పించింది. దాని లోపలి పేజీమీద రవికుమార్ అని అందంగా పెయింట్ చెయ్యబడి క్రింద "పెన్-నేమ్" చిత్ర అని గోల్డెన్ రంగుతో పెయింట్ చెయ్యబడి వుంది. నళిని యంత్రంలాగ పేజీ తిప్పింది. గుండె చలించటం మర్చిపోయింది. తను మొదట చిత్రకి వ్రాసిన ఉత్తరం అందులో జాగ్రతగా పిన్ చేయబడి వుంది. ఇంతలో వెనకనుంచి 'హాచ్' అని తుమ్ము విన్పించింది. నళినివులిక్కిపడి వెనక్కి తిరిగి చూసింది. రవి నుంచుని ఉన్నాడు. అతని కళ్ళు ఒకవిధమయిన కాంతితో మెరుస్తున్నాయి. దగ్గరకు వచ్చి కందగడ్డలాగ అయిన నళిని ముఖం చూసి "ఎందుకలా సిగ్గుపడ్తావ్? దొంగతనం పట్టుకోబోయి దొంగనయానా? నా బరువును దింపావు. రాత్రింబవళ్ళు నీకు యీ విషయం యేవిధంగా చెప్పటమా అని సందేహిస్తున్న నాకు విశ్రాంతి యిచ్చావు. పోనీలే కాసిని మంచినీళ్ళు తెచ్చిపెట్టు." నళిని యింక అక్కడుంటే నోరు మెదపదని సంబాళించుకోవటానికి కాస్త ప్రక్కకు వెళితే బాగుంటుందని మంచినీళ్ళు కావాలన్నాడు.

రవి అనుకున్నట్లే అయింది. నళిని తన్ని తాను పూర్తిగా సంబాళించుకుని వచ్చింది. మంచినీళ్ళు అందిస్తూ, "ఇంత నాటకం ఆడగల సమర్థులనుకోలేదు." అంది. "అవును. యెలా అనుకుంటావు? నీ చూపంతా చిత్ర మీద ఉంటే? సరేగాని నీ దగ్గర వున్న ఆ వుత్తరాలు గూడా ఇటు ఇవ్వు. రెండూ కలిపి బైండ్ చేయించి పేరు పెడ్దాం. "గొప్పే. పాపం కష్టపడిపోతారు." నళినికి కాస్త ధైర్యం వచ్చింది. "గొప్ప కాదూ మరి. నీతో యింత నాటకమాడటం యెవరికి చాతనవుతుంది. పెళ్లిలో నే చెబ్దామనుకున్నాను. కానీ నువ్వు చెప్పనిస్తేనా?" అని రవి నవ్వుతూ అన్నాడు. నళినికి ఉత్తరంలో మాటలు జ్ఞాపకం వచ్చాయి. "నన్ను చూచి నిర్ణయించుదువుగాని నావ నవ్వు వెన్నెలలు వెదజల్లుతుందో లేక పైశాచికపు విస్ఫులింగాలు రాలుతాయో?" యెంత ధీమాగా రాసుకున్నాడో. "మరి నాకు మీరు పంపిన ఫోటో..." సందేహం దాచుకోలేకపోయింది నళిని. "అది మా కమలది. దానికి చూపించలేదుగా. అందుకని రంగం బయట పడలా. ఒకసారి నేనే ఆ ఫోటో తీసాను. దానికి తరువాత అది పంపటానికి వీలు లేక నా దగ్గరే వుండిపోయింది. ముందర నిన్ను యేడిపించి తర్వాత నా ఫోటో పంపుదామనుకున్నాను. కాని పరిస్థితి విషమించటంవల్ల నోరు మూసుకుని వూరుకున్నాను. నేనే నీ వాడనవుతున్నప్పుడు యింకా ఫోటో యెందుకని సరిపెట్టుకున్నాను. అవాళ మీ తోటలో చెప్పాలని ప్రయత్నంజేసాను. కాని నువ్వు చెప్పనియ్యలేదు.

"యెంత గొప్పవారండి" నళిని హృదయ కుహరంనుండి ఒక నిట్టూర్పు బయటకు వచ్చింది.

"నేనేం గొప్పవాడిని, నువ్వుగాని. సర్లే. నా వుత్తరాలిటియ్యి" రవి యెత్తిపొడుపుగా అన్నాడు.

నళిని పెదవులమీద చిరునవ్వు కదిలింది, "యేం పేరు పెడ్తారు."

"నువ్వు చెప్పుమరి" రవి నళిని కళ్లల్లోకి సూటిగా చూస్తూ అడిగాడు.

"యేమో నాకు తెలియదు" నళిని అక్కడినుంచి పారిపోబోయింది.

"ఆగాగు!" రవి నళిని జడపుచ్చుకుని, "చిత్ర నళినీయం తెలుసా?" అన్నాడు.

మనసులో తెరలు వీడిపోయినట్లు ఇద్దరూ హాయిగా నవ్వుకున్నారు.

[సమాప్తి.]



ఇటీవల ఉత్తమకావ్యరచన పోటీలో ఆంధ్రప్రభుత్వ బహుమతి పొందిన "అమర వీణ" కావ్యరచయిత శ్రీ వజ్ఝలవెంకటేశ్వర్లు. వీరిని జయపుర పౌరులు ఏప్రిల్ 13 న సన్మానించారు.